TGTEL/26/A7716

ఉద్యమ పోరు

UDYAMA PORU

ప్రతి పదం పోరాట కదం

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 26 | ఆదివారం | 11.10.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్

మహారాష్ట్రలో 2.7 లక్షల ఓటర్ల వయసు సవరణ

- ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు అక్టోబర్ 12 వరకు గడువు
- ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సీఎం విజ్ఞప్తి
- నవంబర్ 16న తుది ఓటర్ల జాబితా విడుదల

మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం.. బావిలో తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలు

- మహబూబాబాద్ జిల్లాలో విషాద ఘటన
- వ్యవసాయ బావిలో తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలు లభ్యం
- కురవి మండలంలో శనివారం చోటుచే సుకున్న ఘోరం
- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఢిల్లీలో హై టెన్షన్.. మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్

- ఢిల్లీలో నిరసనల ఉద్రిక్తత.. మమతా, కేజ్రీవాల్ అరెస్ట్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల డిమాండ్
- అనుమతి లేదంటూ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రపంచ మార్కెట్‌పై తెలంగాణ కన్ను..

- తెలంగాణ సన్న బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు తరలించే ప్రయత్నాలు
- మనీలా సదస్సులో విదేశీ కొనుగోలుదారులకు ప్రభుత్వ ఆహ్వానం
- రాష్ట్రంలో భారీగా పెరిగిన సన్న బియ్యం ధరలు.. కిలో రూ.80 పైనే
- ఎగుమతులపై పోటీ ప్రభావం, మిల్లర్ల ఆందోళన

ఉద్యమపోరు, హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పండుతున్న మేలురకం సన్న బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఆసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లోని కొనుగోలుదారులతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలు కుదుర్చుకోవడంపై దృష్టి సారించింది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన 'అంతర్జాతీయ ప్రపంచ వరి సదస్సు (ఐడబ్ల్యుఆర్‌సీ) 2026'లో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తన లక్ష్యాలను స్పష్టం చేసింది. ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, తెలంగాణ బియ్యాన్ని నేరుగా కొనుగోలు ....

రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయండి

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

ప్రాజెక్టులో భారీ అవకతవకలు జరిగాయని, ప్రభుత్వానికి రూ. 600 కోట్ల నష్టం వాటిల్లుతుందని ఆరోపణ

తక్కువ కోట్ చేసిన వారిని తప్పించి, ఎక్కువ ధరకు పనులు అప్పగించారని విమర్శ

టెండర్ల ప్రక్రియపై కాగ్ ఆడిట్, శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

ఉద్యమపోరు, హైదరాబాద్ : రాష్ట్రంలో చేపట్టిన రేడియల్ రోడ్డు–2 ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని, వాటిని తక్షణమే రద్దు చేసి సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. రూ.3,296 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో కావాల్సిన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డులోని బుద్వేల్ నుంచి కొడంగల్ సమీపంలోని ఎన్‌హెచ్–167ఎన్ వరకు .....

మిగతా 2వ పేజీ లో..

హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

- భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి
- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు: మంత్రి పొంగులేటి

- గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి
- ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి

కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి

- బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు

- ఎన్నికల కమిషన్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్న రాంచందర్ రావు
- వరుస ఓటములతోనే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ
- రాజ్యాంగబద్ధ సంస్థలపై బురద చల్లుతున్నారని మండిపాటు

ఉద్యమపోరు, హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ (ఈసీ) పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్ ..

సీఈసీ వివాదం : ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

- 13 కోట్ల ఓట్ల తొలగింపు ఆరోపణలు అవాస్తవమన్న వెంకయ్యనాయుడు
- ఓడిపోతే ఈవీఎంలను నిందించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని విమర్శ

ఉద్యమపోరు, న్యూ ఢిల్లీ : చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించారు. విపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని ఆయన హితవు పలికారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ వస్తున్న ఆరోపణలు కేవలం అపోహ మాత్రమేనని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు. "రాజీనామా కోరడం తప్పు కాదు, కానీ రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు" అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓటమి పాలైతే ఈవీఎంలను నిందించడం కొన్ని పార్టీలకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ అని, దానిని వీధుల్లోకి లాగడం దేశ ప్రతిష్టకు మంచిది కాదని అన్నారు. ఎన్నికల సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉన్నామని చెబుతున్నా, ప్రతిపక్షాలు ఎందుకు ఆందోళన చేస్తున్నాయో అర్థం కావడం లేదని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు.

ఢిల్లీలో సీజేపీ నిరసనకారులను తరలిస్తున్న బస్సుపై రాళ్ల దాడి

- దేశ రాజధానిలో 1000 మందికి పైగా ఆందోళనకారుల అరెస్ట్
- సీజేపీ వ్యవస్థాపకుడు, యూట్యూబర్ ధ్రువ్ రాఠీ సహా పలువురి అదుపు
- సీఈసీకి వ్యతిరేకంగా సీజేపీ తలపెట్టిన ఆందోళన

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
ఆదివారం 11.10.2026

ప్రపంచ మార్కెట్‌పై తెలంగాణ కన్ను..

మొదటిపేజీ తరువాయి.. చేసేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ రిటైలర్లు, ఫుడ్ కంపెనీలు, ఎగుమతిదారులను ఆహ్వానించారు. కేవలం దేశీయంగా మిగులు నిల్వలను నిర్వహించడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక విలువను సృష్టించడంపై దృష్టి సారించామని ఆయన వివరించారు. దేశీయ ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు. గత సీజన్‌లో తెలంగాణలో 18.5 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి జరిగిందని, ఇది దేశ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 12 శాతమని స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. విదేశీ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అధిక నాణ్యత కలిగిన సన్న, మేలురకం బియ్యాన్ని బ్రాండెడ్, ట్రేసబుల్ (ఎక్కడ పండిందో గుర్తించే వీలున్న) పద్ధతిలో సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. గత ఏడాది ఫిలిప్పీన్స్‌కు 30,000 టన్నుల బియ్యాన్ని విజయవంతంగా ఎగుమతి చేసిన అనుభవంతో ఈ కొత్త ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు ఒకవైపు ప్రభుత్వం ఎగుమతులపై దృష్టి సారిస్తుండగా, మరోవైపు రాష్ట్రంలో సన్న బియ్యం ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. 'సన్న బియ్యం' పీడీఎస్ పథకం కింద ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం సేకరించడం, కొన్ని జిల్లాల్లో వరి సాగు తగ్గడం, ఎల్ నినో ప్రభావంపై ఆందోళనల కారణంగా బహిరంగ మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గింది. దీంతో కొద్ది వారాల క్రితం కిలో రూ.70 ఉన్న సన్న బియ్యం ధర ఇప్పుడు రూ.80-82కి చేరింది. 25 కిలోల బస్తా ధర రూ.2,150 సమీపంలో పలుకుతోంది. ఇదే సమయంలో, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సేకరణ వ్యయం అధికంగా ఉండటంతో ఎగుమతుల్లో పోటీని తట్టుకోలేకపోతున్నామని కొందరు మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి

: బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు

మొదటిపేజీ తరువాయి.. లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, మీడియా ప్యానలిస్టులతో జరిగిన సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. దొంగ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు. వరుస ఎన్నికల్లో ఓటమి పాలవుతున్న కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజాస్వామ్యంలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటర్ల జాబితా నుంచి తమ మద్దతుదారుల పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో రాంచందర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జాతీయ స్థాయిలో రాష్ట్రపతిని కూడా కలిసి తమ వాదనలు వినిపించారు.

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు

: మంత్రి పొంగులేటి

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

హైదరాబాద్ హైస్పీడ్ రైల్..

భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయండి

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

మొదటిపేజీ తరువాయి.. నిర్మించ తలపెట్టిన 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనులను ప్యాకేజీలుగా విభజించి, తమకు అనుకూలమైన సంస్థలకు కట్టబెట్టారని కేటీఆర్ తన లేఖలో ఆరోపించారు. తక్కువ ధరకు బిడ్లు దాఖలు చేసిన వారిని అనర్హులుగా ప్రకటించి, అంచనా వ్యయం కంటే ఎక్కువ ధరకు పనులు కేటాయించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.600 కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 30న బిడ్ల దాఖలుకు గడువు ముగియగా, కేవలం ఐదు పని దినాల్లోనే అంటే అక్టోబర్ 8 నాటికి టెక్నికల్ ఎవాల్యుయేషన్, అర్హతల పరిశీలన, ఫైనాన్షియల్ బిడ్ల ప్రారంభం, పనుల కేటాయింపు పూర్తి చేయడంపై కేటీఆర్ సందేహాలు వ్యక్తం చేశారు. ఇంత భారీ ప్రాజెక్టుకు సంబంధించిన 13 బిడ్లను ఇంత తక్కువ సమయంలో ఎలా ప్రాసెస్ చేశారని ప్రశ్నించారు. ప్యాకేజీ-I పనులను ఎన్‌సీసీ లిమిటెడ్‌కు అంచనా వ్యయం కంటే 3.95 శాతం అధికంగా రూ.1,286.03 కోట్లకు కేటాయించారని, ప్యాకేజీ-II బీవీఎస్ఆర్‌కు, ప్యాకేజీ-III జీకేసీకి అప్పగించారని తన లేఖలో పేర్కొన్నారు. అంచనా వ్యయాలు, కోట్ చేసిన ధరలు, బిడ్డర్ల అనర్హతకు గల నిర్దిష్ట కారణాలు, తుది కాంట్రాక్ట్ విలువలు, టెక్నికల్ ఎవాల్యుయేషన్ నివేదికలతో సహా అన్ని రికార్డులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లలో హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కేటాయించిన రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)తో ప్రత్యేక ఆడిట్ జరిపించాలని, టెండర్ల ప్రక్రియపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కేటీఆర్ కోరారు. కేటీఆర్ రాసిన ఈ లేఖతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కాంట్రాక్టులలో పారదర్శకతపై రాజకీయ చర్చ మరింత తీవ్రమైంది.

మహారాష్ట్రలో 2.7 లక్షల ఓటర్ల వయసు సవరణ

మొదటిపేజీ తరువాయి.. మహారాష్ట్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.7 లక్షల మంది ఓటర్ల వయసులో ఉన్న పొరపాట్లను శనివారం సరిదిద్దింది. మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ఎస్. చొక్కలింగం చేసిన ప్రత్యేక విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ చర్యలు చేపట్టింది. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ గడువు ముగియకముందే ఈ సవరణలు పూర్తి చేయడంతో ఓటర్లు తమ వయసు మార్పు కోసం ఇకపై ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఎస్ఆర్) కింద అభ్యంతరాలు తెలిపేందుకు గడువును అక్టోబర్ 12 వరకు పొడిగించారు. ఈ నోటీసులు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియ నవంబర్ 10 వరకు కొనసాగనుంది. అనంతరం, నవంబర్ 16న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. జాబితాలో తప్పులు లేదా పత్రాల అసంబద్ధత కారణంగా మొత్తం 1.22 కోట్ల మంది ఓటర్లకు నోటీసులు జారీ అయ్యాయి. పత్రాలను సమర్పించేందుకు ప్రజలు నేరుగా కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా, వాట్సాప్ ద్వారా పంపే వెసులుబాటును అధికారులు కల్పించారు. మరోవైపు, ముసాయిదా జాబితా నుంచి తొలగించిన 1.51 కోట్ల మంది ఓటర్లలో ఇప్పటివరకు కేవలం 3.9 లక్షల మంది మాత్రమే తిరిగి నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, వారాంతాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వలసలు, జనాభా మార్పుల దృష్ట్యా ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) సైతం ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం..

బావిలో తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలు

మొదటిపేజీ తరువాయి.. మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులతో సహా వ్యవసాయ బావిలో విగతజీవిగా కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. ఈ హృదయ విదారక సంఘటన శనివారం కురవి మండలంలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. కురవి మండలానికి చెందిన బానోతు అనూష(26)కు కుమార్తె వర్షిణి (9), కుమారుడు విశాల్ కృష్ణ (4) ఉన్నారు. శనివారం సాయంత్రం అయినా అనూష తన పిల్లలతో ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్క ప్రాంతాల్లో గాలించగా, తండా శివార్లలోని ఓ వ్యవసాయ బావిలో అనూష, ఆమె ఇద్దరు పిల్లల మృతదేహాలు కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో మృతదేహాలను బావిలో నుంచి వెలికితీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ముగ్గురి మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు విచారణ జరుపుతున్నారు. కుటుంబ కలహాలు ఏమైనా ఉన్నాయా లేదా ఇది ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఇలా అనుమానాస్పద స్థితిలో మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసుల దర్యాప్తు పూర్తయితే గానీ ఈ ఘటన వెనుక ఉన్న అసలు కారణాలు తెలిసే అవకాశం లేదు.

ఢిల్లీలో హై టెన్షన్.. మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్

మొదటిపేజీ తరువాయి.. రాజధాని ఢిల్లీలో నేడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ

ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు. నగరంలో నిరసనలకు ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆందోళనకు ముందస్తు అనుమతి లేనందునే నేతలను అదుపులోకి తీసుకున్నట్టు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై విపక్షాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టాయి. ఈ అరెస్టుల నేపథ్యంలో భవిష్యత్తులో తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

ఢిల్లీలో సీజేపీ నిరసనకారులను తరలిస్తున్న బస్సుపై రాళ్ల దాడి

మొదటిపేజీ తరువాయి.. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసన కార్యక్రమం ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నిరసనలో పా ల్గొనేందుకు వస్తున్న ఆందోళనకారులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమం లో అరెస్ట్ చేసిన నిరసనకారులను తరలిస్తున్న బస్సు పై జన్‌దేవాలన్ ప్రాంతంలో కొందరు రాళ్ల దాడికి పాల్పడటం కలకలం రేపింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, అదుపులోకి తీసుకున్న కొందరు కార్యకర్తలను పోలీసులు బస్సులో తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో కొందరు నిరసనకారులు పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించడమే కాకుండా, బస్సును ధ్వంసం చేసేందుకు కూడా యత్నించారు. అయితే, పోలీసులు వారిని వెంటనే నియంత్రించి, నిర్దేశిత ప్రాంతానికి తరలించారు. ఈ ఘటనతో జన్‌దేవా లన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సీజేపీ పిలుపు మేరకు జంతర్ మంతర్ వద్దకు చేరుకుంటున్న నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో శని వారం దేశ రాజధాని వ్యాప్తంగా 1,000 మందికి పైగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు, నిరసనకు ముందే సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే, అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా గురుగ్రామ్‌లోని ఆయన నివాసంలో అరెస్ట్ చేశారు. సుమారు 50 మంది పోలీసులు మఫ్టీలో వచ్చి ఉదయం 8 గంటలకు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సీజేపీ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొంది. గతంలో నిర్వహించిన నిరసనల సందర్భంగా చట్టపరమైన ఆదేశాలను, ఇచ్చిన హామీలను సీజేపీ నిర్వాహకులు పాటించనందున, ఈసారి నిరసనకు అనుమతి నిరాకరించినట్లు పోలీసులు శుక్రవారమే స్పష్టం చేశారు. ప్రస్తుతం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
ఆదివారం 11.10.2026

ఎంగిలిపూల బతుకమ్మ నాడు చెరువుగట్టు

జడల రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

ఉద్యమపోరు, నల్లగొండ, అక్టోబర్ 10 : అమావాస్య రోజున ప్రారంభమయ్యే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఎంగిలిపూల బతుకమ్మ (మాఘ అమావాస్య) నాడు చెరువుగట్టు జడల రామలింగేశ్వర స్వామిని శివ భక్తుడు, హనుమాన్ ఆలయ చైర్మన్ బత్తిని మహేష్ గౌడ్, గూడ పృద్వి గౌడ్, గూడా సాయి చంద్ర బోస్ గౌడ్ లు దర్శనం చేసుకున్నారు. ఈ రోజున ఇక్కడ దర్శనం పొందడం శుభప్రదం అని ప్రజలు భావిస్తారు. అంతేకాక ఇక్కడ ఈ పవిత్ర రోజున స్నానం, దానం, పితృ తర్పణాలు చేస్తారు. ఏ సందర్భంగా బంతిని మహేష్ గౌడ్ మాట్లాడుతూ ఆలయానికి 365 మెట్లు మెట్ల ద్వారా శిఖరం పైకి వెళ్లి పరమ శివునికి అభిషేకం చేయడం ద్వారా జన్మ ధన్యమవుతుందని జీవితంలో ఉన్న సర్వ పీడ దోషాలు దూరం అవుతాయని పేర్కొన్నారు. ప్రతి నెల అమావాస్య రోజున చెరువుగట్టు జడల రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేయడం ద్వారా మంచి ఫలితాలు జరుగుతాయని తెలియజేశారు. అదేవిధంగా ప్రతి అమావాస్య స్వామివారికి లక్ష 16 వేల పుష్పాలతో ప్రత్యేక పుష్పాభిషేక కార్యక్రమం ఉంటుందని, పూజా కార్యక్రమం అమావాస్య రోజు నిర్వహించడం చాలా అద్భుతంగా జరుగుతుందని తెలియపరిచారు. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో స్వామివారి సన్నిధిలో ప్రత్యేక నిద్రా కార్యక్రమాలు చేస్తారని, వారి కోరికలు సకాలంలో నెరవేరిన ఎడల భక్తులు మరల నిద్ర చేసి మొక్కులు చెల్లించుకుంటారని తెలియపరిచారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి మల్లారెడ్డి

ఉద్యమపోరు, శామీర్ పేట, అక్టోబర్ 10 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ ఆడపడుచులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ప్రకృతిని పూజిస్తూ, రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి, సామూహికంగా వేడుకలు నిర్వహించుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని పేర్కొన్నారు. మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు.బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని, తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు మల్లారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెంజర్ల యాదయ్యకు జన్మదిన శుభాకాంక్షలు

ఉద్యమపోరు, మహేశ్వరం, అక్టోబర్ 10 : మహేశ్వరం: పేదల పెన్నిధిగా,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసే ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందిన మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పెంజర్ల యాదయ్యకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి,ప్రజానాయకుడు కిచ్చన్న లక్ష్మారెడ్డి అన్న సోదరుడిగా ప్రజల మధ్య ఉంటూ,ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ,వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్న పెంజర్ల యాదయ్య మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ,భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు,ఐశ్వర్యం,సుఖసంతోషాలు ప్రసాదించాలని,ప్రజా సేవలో మరింత కాలం కొనసాగుతూ ప్రజల మన్ననలు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

కలెక్టర్ కఠిన నిర్ణయం సరికాదు

- తక్కల్లపల్లి రవీందర్ రావు

ఉద్యమపోరు, నర్సంపేట, అక్టోబర్ 10 : నర్సంపేట లోని ప్రైవేట్ ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేయడంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న కలెక్టర్ వ్యవహారం సరైనది కాదని తద్వారా సాధారణ మధ్య తరగతి ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధి అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ పిఎసిఎస్ చైర్మన్, మాజీ ఎంపీపీ తక్కల్లపల్లి రవీందర్ రావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడలేని నిబంధనలను నర్సంపేటకు అమలు చేస్తూ ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వకుండా సుమారు రెండు సంవత్సరాల నుండి కలెక్టర్ తాత్సరం చేయడం సరికాదన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆక్ట్ ప్రకారం అనుమతులు ఇవ్వడం మంచిదే కానీ కఠిన నిర్ణయాలను అమలు చేయడం మూలంగా సాధారణ మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గమనించాలని వారు కోరారు. రాష్ట్రంలో ఎక్కడ ఆసుపత్రులు లేనట్లు డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ వాటికి వర్తించినట్లు నర్సంపేటకు మాత్రమే వర్తిస్తున్నట్లు కలెక్టర్ ప్రవర్తించడం సమంజసం కాదని ఫైర్ ఎన్ఓసి ఫైర్ ఆడిట్ సర్టిఫికెట్లు భవన నిర్మాణాలను పైన ఆధారపడి ఉంటాయని సదరు భవన నిర్మాణాలు గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ అనుమతులతో నిర్ణయిస్తారని గమనించాలని వారు కోరారు. నిబంధనలను అమలు చేయాలంటే అది ప్రజలకు ఇబ్బంది కాకుండా ఉండాలని ప్రజలు ఇబ్బంది పడితే ప్రజాపాలన ఎలా అవుతుందని వారు కలెక్టర్ ను ప్రశ్నించారు. ఆసుపత్రుల అనుమతుల విషయంలో నర్సంపేట డాక్టర్లు ఒక నిర్ణయం ప్రకటించాలని వారు తీసుకునే నిర్ణయాలకు బి ఆర్ ఎస్ పార్టీ సహకారం అందిస్తుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రులన్నీ కూడా నర్సంపేట గ్రామపంచాయతీ గా ఉన్న సమయంలో నిర్మించారని, అప్పటి నిబంధనల మేరకే భవనాలు నిర్మితమయ్యాయని గమనించాలని వారు కోరారు.ఆసుపత్రుల పై పోలీస్ విచారణ జరపడం దారుణమని అన్నారు.ఏది ఏమైనప్పటికి ఆస్పత్రుల అనుమతులు మంజూరు చేయడంలో కలెక్టర్ అవలంబిస్తున్న కఠిన ధోరణి మూలంగా సాధారణ మధ్యతరగతి ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధి అందకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా ఆస్పత్రుల పైకి కోపంతో దాడులకు సైతం దిగుతున్నారని వారు అన్నారు. కలెక్టర్ ఈ విషయం పట్ల సానుకూలంగా స్పందించి ప్రైవేట్ ఆస్పత్రులకు అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. నర్సంపేట పరిసర ప్రాంతాలంతా పేద మధ్య తరగతి కుటుంబాలు జీవనం సాగిస్తూ ఉంటాయని, వారికి ఏ రకమైన ఆరోగ్య సమస్యలు వచ్చిన నర్సంపేట పట్టణంలో ఉన్న ఆస్పత్రులను ఆశ్రయిస్తారని, వారికి అయిన కనీస ఆసుపత్రి ఖర్చులను ప్రభుత్వం నుండి పొందే అవకాశం లేకుండా కలెక్టర్ చేయడం ఒకింత బాధాకరమైనప్పటికీ ఈ వ్యవహారంలో డాక్టర్లను దోషులుగా చిత్రికరించడంతో పాటు ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వారు ఆరోపించారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత ముఖ్యమంత్రి సహాయనిధి అందడం లేదని ప్రజలు వాపోతున్న తీరు బాధాకరమని వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ అంశాన్ని పరిష్కరించాలని తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు..కలెక్టర్ ఈ విషయం పట్ల స్పందించకపోతే రాష్ట్ర అధినాయకత్వానికి ఈ సమస్యను వివరించి బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యాచరణను సిద్ధం చేసి, ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా చూస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు.

గ్రామాభివృద్ధికి సల్మాన్ కృషి మరువలేనిది...

- సల్మాన్ ఆశయాలు,..ఆలోచనలు ముందుకు తీసుకెళ్లాలిట్
- గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

ఉద్యమపోరు, మంథని/మహదేవ్‌పూర్, అక్టోబర్ 10 : మహదేవ్‌పూర్ గ్రామాభివృద్ధికి మాజీ ఉపసర్పంచ్ సల్మాన్‌ఖాన్ చేసిన కృషి మరువలేనిదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మహదేవ్‌పూర్ లో మాజీ ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్ స్మారకార్థంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సల్మాన్‌ఖాన్ ఈనాడు మన మద్యలో లేకపోవడం బాధాకరమని, ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తామని ఏనాడు ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాటలు చెప్పడం కాదు చేయడం ముఖ్యమని అనేక విషయాల్లో గొప్ప సందేశం ఇచ్చాడని గుర్తు చేశారు. ఈనాడు సర్పంచ్‌లకు ఉపసర్పంచ్‌లకు అనేక బేధాభిప్రాయాలు ఉంటున్న తరుణంలో మహదేవ్‌పూర్ సర్పంచ్ నిర్ణయానికి ఉపసర్పంచ్‌గా సల్మాన్ కట్టుబడి పనిచేశారని ఆయన అన్నారు. నమ్మకం, ధైర్యం, ఉత్సాహం సల్మాన్‌లో కన్పించేదన్నారు. సల్మాన్‌ఖాన్ స్మారకంగా నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ మంథని, మహదేవ్‌పూర్ క్రీడాకారులకు ఉపయోగపడాలన్నారు. ఈ ప్రాంత మట్టి బిడ్డలు ఏ అవకాశం వచ్చినా ఏమీ తీసిపోరని, త్రోబాల్‌లో పలిమెల మండలానికి చెందిన మట్టిబిడ్డ బంగారు పతకం సాధించిందన్నారు. ఎంతో మంది ప్రతిభ ఉన్న క్రీడాకారులు ప్రోత్సాహం లేక అవకాశాలు రాక ఆగిపోతున్నారని ఆయన వాపోయారు. ఈ ప్రాంతంలో చదువులు, క్రీడలకు ప్రోత్సాహం అంతగా లేదని అన్నారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ క్రీడలు, చదువులకు అన్ని రంగాలకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. సల్మాన్‌ఖాన్ స్మారకంగా నిర్వహించే ఈ పోటీలు ఈ ఏడాది కాకుండా ప్రతి సంవత్సరం నిర్వహించాలని, అందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని, అలాగే తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. గ్రామీణ క్రీడల ద్వారా క్రీడాకారులు తమ ప్రతిభను చాటి రాష్ట్ర దేశ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడా నిర్వాహకులు బంధు, ప్రాంత ప్రీతి లేకుండా చూడాలని, ఒకప్పుడు మంథనిలో ఇలాంటి పరిస్థితులే ఉండేవని, కానీ తాము బంధు ప్రాంత ప్రీతికి వ్యతిరేకమని, వాటిని చేధిస్తూ గొప్పగా క్రీడలు నిర్వహించామని గుర్తు చేశారు. ఈ క్రీడలను గ్రామీణ క్రీడాకారులు క్రీడావైపుణ్యానికి ఉపయోగించుకుని గొప్ప క్రీడాకారులుగా ఎదుగాలని ఆయన ఆకాంక్షించారు.

కేసీఆర్‌పై అవమానకర చర్యలు కాంగ్రెస్ పతనానికి నాంది!

- చల్లా ధర్మారెడ్డి

ఉద్యమపోరు, హనుమకొండ, అక్టోబర్ 10 : తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల పాలనలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ జిల్లాల ఏర్పాటు దశాబ్ది సందర్భంగా శనివారం హనుమకొండలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చల్లా ధర్మారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

కేసీఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని చల్లా ధర్మారెడ్డి పేర్కొన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం, 33 జిల్లాలను ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లాకు కలెక్టరేట్ల నిర్మాణం చేపట్టడం ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రైతుబంధు, రైతుబీమా, నాణ్యమైన విద్యుత్ సరఫరా వంటి పథకాలతో రైతాంగానికి భరోసా కల్పించారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి పోశారని పేర్కొన్నారు.కేసీఆర్, కేటీఆర్‌ల సహకారంతో పరకాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చల్లా ధర్మారెడ్డి తెలిపారు. ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన పరకాల రెవెన్యూ డివిజన్‌ను సాధించామని, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించామని గుర్తుచేశారు. దామెర, నడికుడ నూతన మండలాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటికి అవసరమైన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపట్టామన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ద్వారా మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. హనుమకొండలో 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం సహా విద్యా, వైద్య రంగాలకు కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.

కేసీఆర్‌ను అవమానిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసి, రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేసిన కేసీఆర్ పట్ల కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరును చల్లా ధర్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడం, రంపాలతో కోసే విధంగా ప్రదర్శనలు నిర్వహించడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. తెలంగాణ సాధకుడిని అవమానించడం ద్వారా కాంగ్రెస్ నాయకులు ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసిన నాయకుడిని అవమానించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించలేరని అన్నారు. కేసీఆర్‌ను కించపరిచే చర్యలకు పాల్పడే నాయకులకు ప్రజాక్షేత్రంలో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే రాజకీయాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, తాటికొండ రాజయ్య, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి,నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
ఆదివారం 11.10.2026

ప్రజా సౌలభ్యం కోసమే 33 జిల్లాల ఏర్పాటు : మరుపల్ల రవి

- కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం.. బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

ఉద్యమపోరు, హనుమకొండ, అక్టోబర్ 10 : తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం 33 జిల్లాలను ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి, ఉద్యమ నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కృషిని ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు అక్టోబర్ 10న చెట్లోళ్ల గడ్డ వద్ద కేసీఆర్ చిత్ర పటానికి ఆయన క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మరుపల్ల రవి మాట్లాడుతూ.. గతంలో జిల్లాల పరిధి విస్తారంగా ఉండటంతో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో 33 జిల్లాలను ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి జిల్లాలో కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. దీంతో ప్రజలకు పరిపాలనా సేవలు మరింత చేరువయ్యాయని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మరుపల్ల రవి వ్యాఖ్యానించారు. యువత కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌లో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతు ఉన్న అభ్యర్థులు ఓటమి పాలవడం, బీఆర్ఎస్ మద్దతున్న సంఘాలు విజయం సాధించడం కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గుతోందనడానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వనం కుమార్, మరుపల్ల గౌతం, పోలెపాక రాజన్‌బాబు, శెట్టి మోహన్, అంకం దేవానంద్, కళ్యాణపు వెంకటేశ్వర్లు, భౌరిశెట్టి సదానందం, కెంచ ఆనంద్, మాటేటి శ్యామ్, టమ్‌టమ్ నరసింహ, కుండె సదానందం, చింతపట్ల ప్రశాంత్, నామాల రాజు, అన్న శ్రీనివాస్, యాకూబ్ పాషా, పోలేపాక మల్లేశం, దాసరి నాగరాజు, నరిగె సదానందం, కొలుపుల కోటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి వీధిలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

- ఆటపాటలతో అలరించిన ఆడపడుచులు.. మహంకాళి ఆలయ ఆవరణలో పండుగ సందడి

ఉద్యమపోరు, వరంగల్ తూర్పు, అక్టోబర్ 10 : వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 42వ డివిజన్ మహంకాళి వీధిలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహంకాళి ఆలయ ఆవరణలో ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సామాజిక ఐక్యతకు ప్రతిబింబమని మహిళలు పేర్కొన్నారు. పువ్వులనే దేవతగా భావించి ప్రకృతిని ఆరాధించడం బతుకమ్మ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానంలో బతుకమ్మ పండుగ అంతర్భాగంగా నిలిచిందన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగిసే తొమ్మిది రోజుల పండుగలో మహిళలు తమ కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో కలిసి ఒకచోట చేరి బతుకమ్మను పూజిస్తూ ఆటపాటలతో ఆనందంగా గడుపుతారని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మహిళలు తెలిపారు. మహంకాళి ఆలయ ఆవరణలో మహిళల ఆటపాటలతో పండుగ వాతావరణం నెలకొంది.

సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి పై దుష్ప్రచారాన్ని ఆపాలి.

- చింతపట్ల కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్ ప్రత్యర్థిగా మచ్చ జంగయ్య.
- బిఆర్ఎస్ ఈ దుర్మార్గమైన చర్యకు భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదు
- ఆడపిల్లలను అడ్డం పెట్టుకొని చేసే రాజకీయం నీచమైన రాజకీయం

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 10 : యాచారం మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మచ్చ జంగయ్య మాట్లాడుతూ,ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బస్సులో ప్రయాణిస్తూ, ప్రజలతో మాట్లాడిన దృశ్యాలను కొంతమంది వక్రీకరించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని. చింతపట్ల కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సర్పంచ్ అభ్యర్థిగా అత్యర్థిగా మచ్చ జంగయ్య ఆరోపించారు.అక్టోబర్ 6న కలెక్టరేట్ కార్యక్రమం అనంతరం బొంగ్లూర్ గేటు వద్ద ప్రయాణికుల కష్టసుఖాలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే ఆర్టీసీ బస్సులో ప్రయాణించారని తెలిపారు. బస్సులో తన కూతురు తో సమానం గల యువతితో మాట్లాడిన దృశ్యాలను వక్రీకరించి ట్రోలింగ్ చేయడం సరికాదన్నారు. రాజకీయ విమర్శలకు అంశాలు లేకపోవడంతోనే ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను మానుకోవాలని మచ్చ జంగయ్య హెచ్చరించారు.మీరు ఏదైనా అభివృద్ధి గురించి మాట్లాడాలి ప్రజలకు ఉపయోగం జరిగేలా మాట్లాడాలి. అంతే ఏలాంటి మచ్చలేని మా నాయకుని పైన దుర్రుప్రచారం చేస్తే ఊరుకునేది లేదు నియోజకవర్గంలో కూడా తిరుగకుండా ప్రజలే మీకు బుద్ధి చెప్తారు. అని కాంగ్రెస్ యువ నాయకుడు మచ్చ జంగయ్య బిఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు.

వెల్జాల్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు: పూల పండగలో మురిసిన ఆడపడుచులు

- రంగురంగుల పూలవనం.. వెల్జాల్‌లో ఘనంగా గౌరమ్మ చెంతకు చేరిన ఆడపడుచులు
- తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక.. వెల్జాల్ పల్లెలో ఆకట్టుకున్న బతుకమ్మ ఆటపాటలు

ఉద్యమపోరు, తలకొండపల్లి, అక్టోబర్ 10 : తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామం ప్రకృతి అందాలతో పరవశించిపోయింది.తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దం, ప్రకృతిని దైవంగా పూజించే విశిష్టమైన బతుకమ్మ సంబరాలు శనివారం గ్రామంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.తీరొక్క పూలతో కొలువైన గౌరమ్మను పూజించేందుకు పల్లె గుండె ఉప్పొంగింది.భక్తిశ్రద్ధలతో బతుకమ్మల తయారీతీరైన గునుగు, తంగేడు, చామంతి, బంతి పూలను సేకరించి, మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం వేళ గ్రామ చౌరస్తాకు బతుకమ్మలను చేర్చడంతో ఆ ప్రాంతమంతా రంగురంగుల పూలవనంగా మారింది. గౌరమ్మను సాక్షాత్తూ తమ ఇంటి ఆడపడుచుగా భావించి మహిళలు పూజలు నిర్వహించారు.ఆకట్టుకున్న ఆటపాటలుఈ వేడుకల్లో పొద్దుటూరు లలిత, తులసి, వరలక్ష్మి , యాదమ్మలతో పాటు గ్రామ ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.బతుకమ్మల చుట్టూ తిరుగుతూ, చప్పట్లు కొడుతూ వారు పాడిన సాంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆడిన ఆటలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశాయి. ఉయ్యాల పాటలు, కోలాటాలతో వెల్జాల్ వీధులు మార్మోగాయి. ప్రకృతిని, ఆడపిల్లను గౌరవించే ఈ మహోత్సవంలో పాల్గొనడం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా మహిళలు ఆనందం వ్యక్తం చేశారు

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు..

- మహిళలు, విద్యార్థులతో కలిసి సందడి చేసిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి

ఉద్యమపోరు, మహేశ్వరం, అక్టోబర్ 10 : తెలంగాణ సాంస్కృతిక ప్రతీక, ఆడపడుచుల ఆత్మగౌరవ వేడుక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఈరోజు హైదరాబాద్‌లోని చారిత్రాత్మక ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మహిళలు, కాంగ్రెస్ నాయకులు మరియు విద్యార్థినులతో కలిసి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ, సాంస్కృతిక పాటలు పాడుతూ ఆడుతూ సందడి చేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణమంతా బతుకమ్మ పాటలతో, మహిళల కేరింతలతో పండుగ శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా పారిజాత నరసింహారెడ్డి గారు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తోందని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ఉత్సాహంగా పాలొనాలని ఆమె పిలుపునిచ్చారు. యూనీవర్సిటీ ప్రాంగణంలో విద్యార్థినులతో కలిసి ఇంతటి వేడుక జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఎన్ఎస్‌యూఐ నాయకులు, మహిళలు, యువతీ యువకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు ఎస్సారెస్పీ నీటి విడుదల

- రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి... మార్కెట్ కమిటీ చైర్మన్‌కుడుదుల వెంకన్న

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్-10 : వర్షాకాల పంటలను కాపాడేందుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) నుంచి శనివారం నీటిని విడుదల చేసినట్లు మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న తెలిపారు. రేవెల్లి డిస్ట్రిబ్యూటరీ ద్వారా డీ-86, డీ-83 కాలువల పరిధిలోని పంటలకు సోమవారం వరకు నీరందించనున్నట్లు పేర్కొన్నారు.పంటలు చేతికొచ్చే వరకు రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేస్తామని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. పంటల పరిరక్షణకు నీటి విడుదలలో సహకరించిన రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోపణల రాజకీయాలు కాదు.. అభివృద్ధే అసలైన ప్రాధాన్యం!

- వికారాబాద్‌లో పరస్పర విమర్శలపై ప్రజల్లో అసంతృప్తి
- ప్రతిపక్షాల విమర్శలకు పనులతోనే సమాధానం చెప్పాలి
- అధికార పక్షానికి ప్రజల పట్ల మరింత బాధ్యత అవసరం

ఉద్యమపోరు, వికారాబాద్, అక్టోబర్ 10 : వికారాబాద్: వికారాబాద్ పట్టణంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సాగుతున్న ఆరోపణలు, ప్రత్యారోపణలు రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతిపై దృష్టి సారించాల్సిన నాయకులు పరస్పర విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండటంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రతిపక్షాలు అధికార పార్టీపై విమర్శలు చేసినప్పుడు, వాటిని సంయమనంతో ఖండిస్తూ వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అధికార పక్షంపై ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అంతేకానీ, అవమానకరమైన వ్యాఖ్యలు, రెచ్చగొట్టే మాటలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించడం సమంజసం కాదని పేర్కొంటున్నారు.గతంలో అధికారంలో ఉన్న పార్టీలు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోవడం వల్లే అధికారానికి దూరమయ్యాయని రాజకీయ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత అధికార పార్టీకి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత మరింత ఎక్కువగా ఉంది. గత పాలనలో జరిగిన తప్పులను ప్రస్తావిస్తూ కాలం గడపడం కంటే, ప్రస్తుతం ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటిని వేగంగా పూర్తి చేయడమే పాలకుల సమర్థతకు నిదర్శనమవుతుంది.ప్రతిపక్షాలు చేసే విమర్శలకు వ్యక్తిగత ఆరోపణలతో బదులివ్వడం కంటే, అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు ఫలితాలు చూపించడం ద్వారా సమాధానం చెప్పాలని ప్రజలు సూచిస్తున్నారు. రహదారులు, మురుగునీటి కాలువలు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చి, చేపట్టిన పనులను గడువులోగా పూర్తి చేస్తే విమర్శలకు సహజంగానే సమాధానం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.ప్రతిరోజూ రాజకీయ నాయకులు సమావేశాలు నిర్వహిస్తూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడానికే సమయం కేటాయిస్తే పట్టణ అభివృద్ధిపై దృష్టి ఎప్పుడు సారిస్తారనే ప్రశ్న ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం ప్రతిపక్షాల బాధ్యత కాగా, విమర్శలకు తగిన సమాధానం ఇవ్వడంతోపాటు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం అధికార పక్షం బాధ్యత. ఈ రెండు బాధ్యతలను విస్మరించి పరస్పర నిందారోపణలకే పరిమితమైతే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గే ప్రమాదం ఉంది.వికారాబాద్‌లో ఇకనైనా విమర్శలు, ప్రతి విమర్శలకు స్వస్తి పలికి ప్రజా సమస్యల పరిష్కారంపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారంలో ఉన్న పార్టీ తన పనితీరుతో ప్రజల మన్ననలు పొందాలి. ప్రతిపక్షాలు నిర్మాణాత్మక విమర్శలతో పాలనను మెరుగుపరిచేందుకు కృషి చేయాలి. వ్యక్తిగత విమర్శలు, పరస్పర దూషణలు కాకుండా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారినప్పుడే వికారాబాద్ ప్రగతికి బాటలు పడతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్.. యువకుడికి తీవ్ర గాయాలు

- ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కాలు.. భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

ఉద్యమపోరు, దుమ్ముగూడెం, అక్టోబర్ 10: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం ఆంధ్రకేసరి నగర్ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదురుగా వేగంగా వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో శ్రీనగర్ కాలనీకి చెందిన పొదుతూరి నవీన్ (32) తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో అతడి ఒక కాలు నుజ్జునుజ్జయి, తీవ్ర రక్తస్రావమైంది. రోడ్డుపై గాయాలతో పడి ఉన్న నవీన్‌ను గుర్తించిన స్థానికులు వెంటనే ములకపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నవీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం

హనుమకొండలో ఉద్రిక్తత.. కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

- ఉమ్మడి వరంగల్ జిల్లా విభజనపై కాంగ్రెస్ శ్రేణుల నిరసన
- అశోక్ జంక్షన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన

ఉద్యమపోరు, హనుమకొండ, అక్టోబర్10 : ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు జిల్లాలుగా విభజించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హనుమకొండలో ఆందోళన చేపట్టారు. అశోక్ జంక్షన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. చారిత్రక ప్రాధాన్యం కలిగిన వరంగల్ నగరాన్ని జిల్లాల విభజన పేరుతో విడదీయడం వల్ల ప్రాంత అభివృద్ధికి నష్టం జరిగిందని ఆరోపించారు. గత పదేళ్లలో ఉమ్మడి వరంగల్ జిల్లా విభజనతో పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఆర్థిక, అభివృద్ధి రంగాల్లో ఈ ప్రాంతం వెనుకబడిందని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. ఉమ్మడి జిల్లా ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరించిన గత ప్రభుత్వ తీరును ప్రజలు ఎప్పటికీ క్షమించబోరని నాయకులు హెచ్చరించారు. ఆందోళనలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేయడంతో అశోక్ జంక్షన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు అక్కడ మోహరించారు.

ఎంఎస్‌ఎంఈల కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్'

- సమస్యల పరిష్కారానికి నెలకోసారి "ఎంఎస్ఎంఈ గ్రీవెన్స్ డే"
- నగరంలోని పారిశ్రామిక వాడల అభివృద్ధికి చర్యలు
- ఎల్ యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్"లో మంత్రి శ్రీధర్ బాబు

ఉద్యమపోరు, మంథని/హైదరాబాద్, అక్టోబర్ 10 : రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)ను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ విశ్వవ్యాప్తమయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు, పెట్టుబడుల అనుసంధానం తదితర అంశాల్లో ఎంఎస్ఎంఈలకు మార్గ నిర్దేశం చేస్తామన్నారు. లఘు ఉద్యోగ్ భారతి(తెలంగాణ) ఆధ్వర్యంలో బంజారా హిల్స్ లోని తాజ్ డెక్కన్ లో శనివారం నిర్వహించిన "ఎల్ యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎంఎస్ఎంఈలు లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తూ పారిశ్రామికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకొచ్చిన ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. క్షేత్రస్థాయిలో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు చూపించేందుకు నెలకోసారి ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యత, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై ఎంఎస్ఎంఈలు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ బీఐ ఎండీ రామ్మోహన్ రావు, లఘు ఉద్యోగ్ భారతి(తెలంగాణ) ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, కె.నరేంద్రనాథ్ దత్, ఓం అనూజ్ ఖడేల్వాల్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ ఎన్నికల్లో విజయం.. మంథని డిపో వద్ద సంబరాలు

- ఏ రాజకీయ పార్టీకి అనుకూలం కాదు.. వ్యతిరేకం కాదు
- తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు: తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు

ఉద్యమపోరు, పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 10 : ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో రాష్ట్ర, రీజియన్ స్థాయిలో గుర్తింపు సాధించడంతో ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు మంథని డిపో గేటు వద్ద విజయోత్సవాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మజ్దూర్ యూనియన్ మంథని డిపో కార్యదర్శి కేకే రెడ్డి మాట్లాడుతూ.. తమ యూనియన్ టీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ కొందరు నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుకూలం కాదని, వ్యతిరేకం కూడా కాదని స్పష్టం చేశారు. స్వతంత్రంగా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించామని తెలిపారు. యూనియన్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు ప్రచారం చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి గంధం రమేష్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు శేఖర్, ఏ. రమేష్, ఐలయ్య, సత్యం, మునీర్, దేవేందర్, లక్ష్మణ్‌తో పాటు గ్యారేజీ కార్మికులు కృష్ణ, శ్రీనివాస్, మెకానిక్ విజయ్, సలీం, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్.బి. ప్రభాకర్ గుప్తా దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం

- అన్నదానం మహాదానం : పితృదేవతల ఆశీస్సుల కోసం అన్నప్రసాద వితరణ

ఉద్యమపోరు, గజ్వేల్, అక్టోబర్ 10 : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో శనివారం అమావాస్యను పురస్కరించుకొని గజ్వేల్ రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.బి. ప్రభాకర్ గుప్తా దంపతులు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కీర్తిశేషులు నేతి బాలింగారి రామనాథం, నాగలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, డాక్టర్ లింగం, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, అయ్యప్ప ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ మాట్లాడుతూ.. అన్నదానం మహాదానమని, అమావాస్య రోజున అన్నదానం నిర్వహించడం ద్వారా పితృదేవతల ఆశీస్సులు లభిస్తాయని పేర్కొన్నారు. దివంగత నేతి బాలింగారి రామనాథం, నాగలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్తెల్లి లక్ష్మయ్య, వెంకటేశం, కాశీనాథ్, కైలాస ప్రశాంత్, సిరిపురం సత్యనారాయణ, నాగేష్, ఎన్.బి. ప్రభాకర్ గుప్తా దంపతులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈత చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఉద్యమపోరు, పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 10 : ఈత చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన గీత కార్మికుడు వంగల ప్రవీణ్ గౌడ్‌ను మంథని గీత గౌడ సహకార సంఘం సభ్యులు శనివారం పరామర్శించారు. మంథని మండలం సూరయ్యపల్లికి చెందిన ప్రవీణ్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.కుటుంబ పోషణ కోసం నిత్యం ఈత చెట్లెక్కి జీవనోపాధి పొందే గీత కార్మికులు అనేక ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించే కార్మికుడు ప్రమాదానికి గురైతే ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.ప్రవీణ్ గౌడ్‌కు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ప్రమాదంలో గాయపడిన కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రవీణ్ గౌడ్ త్వరగా కోలుకుని తిరిగి తన కుటుంబంతో సంతోషంగా గడపాలని సంఘం సభ్యులు ఆకాంక్షించారు. కష్టపడి జీవించే గీత కార్మికుల భద్రతకు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నారంలో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

ఉద్యమపోరు, వరంగల్ జిల్లా / పర్వతగిరి, అక్టోబర్ 10 : పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ సంబరాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకల్లో ఆడపడుచులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలతో కలిసి కోలాటాలు ఆడుతూ, బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులతో సరదాగా గడుపుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. మహిళలతో కలిసిమెలిసి ఆటపాటల్లో పాల్గొనడంతో అన్నారం గ్రామంలోని ఆరో వార్డులో పండుగ సందడి నెలకొంది.తెలంగాణ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అనీ ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ప్రజలతో కలిసి పండుగ వేడుకల్లో పాలొనడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, చిన్నారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ
- ఏఐఎస్ఎఫ్. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 10 : ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని.ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇటికల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బుర్ర మనోజ్ లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.స్థానిక ఖమ్మంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ముందు జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగానికి లోబడి స్వతంత్ర సంస్థగా ఉండాల్సిన ఎన్నికల సంఘాన్ని బీజేపీ మోడీ ప్రభుత్వం వారి రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ,ఎన్నికల అధికారి జ్ఞేనేష్ కుమార్ ని అడుపెట్టుకొని ఓట్ చోరికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. దేశంలో దాదాపు 30 రాష్టలలో 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించి, పౌరుల ప్రాధమిక హక్కుపై బీజేపీ మోడీ ప్రభుత్వం దాడి చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దొంగ ఓటర్ల తొలగింపు పేరుతో రాజ్యాంగాన్ని చేతులోకి తీసుకొని ఉన్న ఓట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకునేది లేదనీ,ఓట్ చోరికి పాల్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞేనేష్ కుమార్ ని తొలగించాల్సిందే అన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మేకల పవన్, బొప్పి ఉమా, చీర కృష్ణ ప్రసాద్, నరేష్, ఉమేష్, సురేష్, లోకేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పై-సోషల్ మీడియా రాజకీయం.....?

- జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి
- బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం వద్దు రంగంలోకి దిగుదాం రండి.
- దిగజారుడు రాజకీయం చేయకండి మానుకోండి
- దమ్ము ధైర్యం ఉంటే నిజమైన రాజకీయం చేయాలి
- ఆడబిడ్డలను అడ్డం పెట్టుకొని చేసే నీచ రాజకీయం ఇదేనా

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 10 : ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలోని ఎలిమినేడు గ్రామంలోని మంకాల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ,అభివృద్ధి ప్ర దాతఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందో మహిళల స్పందన ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్ లోబస్సు ఎక్కిఇంజాపూర్ వరకు బస్సుప్రయాణం చేశారు.బస్సుఎక్కగానే మహిళలని ఆప్యాయంగా పలకరిస్తూ ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందమ్మా అని అడిగి తెలుసుకుంటూ ఒక బిడ్డ లాంటి విద్యార్థిని చెయ్యిపట్టుకొని ఉచిత బస్సు ప్రయాణం ఎలాఉంది అనిఅడిగి తెలుసుకుంటున్న సమయంలో కొంతమంది పోకిరీలు వీడియోలు తీసి ఆవీడియోలను తప్పుగా వక్రీకరించి కావాలని మహిళా చెయ్యి పట్టుకున్నాడని విషప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు.నాయకుడు మల్ రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గానికి తండ్రి ఒక పెద్దన్న లాంటివాడు అని అన్నారు. అలాంటి గొప్ప నాయకుడు గొప్ప ఎమ్మెల్యేపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు గత రెండు రోజులుగా విషప్రచారం చేయడం సరైన పద్ధతి కాదు అన్నారు. ఆడపిల్లలు అంటే గౌరవం లేదా బి ఆర్ఎస్ పార్టీ నాయకులకు అని ఆగ్రహంవ్యక్తం చేశారు.నియోజకవర్గంలో ప్రతిఒక్క కార్యకర్త నాయకుడు మాప్రియతమ ఎమ్మెల్యేని ఆప్యాయంగా రంగన్న అన్న అని ప్రేమతో పలకరి స్తూ ఉంటారు.అలాంటి గొప్ప నాయకుడు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. అదే మీ బి ఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డిని మీపార్టీ నాయకులు ఎవరైనా అన్న అనిపిలిస్తే ఆగ్రహంతో చూస్తాడు మీనాయకుడికి మానాయకుడికి ఉన్నతేడా ఏమిటో తెలుసుకోవాలి అని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి ప నులు చూసి ఓర్వలేకనే ఇలాంటి విషప్రచారాలు చేస్తున్నారు.అని అన్నారు ఒక నియోజకవర్గా నికి ప్రజాప్రతినిధి ఎమ్మెల్యే ప్రతి సమస్య తెలుసుకునే హక్కుఎమ్మెల్యేకు ఉంటుంది ఆహక్కుతోనే మహిళలను కలిసి సమస్యలు తెలుసుకున్నాడు. తెలుసుకోవడం తప్ప అని అన్నారు. దమ్ము ధైర్యం ఉంటే నిజమైన రాజకీయం చేయాలి విమర్శలకు ప్రతివిమర్శ చేసుకోవాలి ఒకఆడ పిల్లను అడ్డం పెట్టుకొని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం సరైన పద్ధతి కాదు అన్నారు.సొంత బంధువులైన ఆడపిల్లలని గౌరవించని సంస్కృతి బిఆర్ఎస్ పార్టీ నాయకులది మహిళలతో పేకాట ఆడుతూ అడ్డంగా దొరికిన సంస్కృతి బిఅర్ఎస్ పార్టీ నాయకులది ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సమయానికి వర్షాలు కురవకరైతులు ఆందోళన చెందుతున్నారు అని తెలుసుకున్న మాఎమ్మెల్యే ప్రతిగ్రామానికి వెళ్లి రైతులను ఎలా ఆదుకోవాలి ప్రణాళికలు సిద్ధం చేస్తూనే గ్రామాలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు చేస్తున్నాడు. ప్రజాసేవకుడు ఇబ్రహీంపట్నం డైనమిక్ ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి అనిఅన్నారు.బిఆర్ఎస్ పార్టీ నాయకులుఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రంగారెడ్డిపై విష ప్రచారాలు చేయడం మానుకోవాలి లేని పక్షంలో రాబోయే సరైన రీతిలో సరైన బుద్ధిచెప్పుతాం అని హెచ్చరించారు.

పీయం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల & జూనియర్ కళాశాల, సిరికొండలో దసరా ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు

ఉద్యమపోరు, నిజామాబాద్ రూరల్ సిరికొండ, అక్టోబర్ 10
సిరికొండ మండల కేంద్రంలోని పీయం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల & జూనియర్ కళాశాల, సిరికొండలో వృత్తి విద్యా విభాగాల ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పది రోజుల దసరా ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా అగ్రికల్చర్ మరియు మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల విద్యార్థులు ఆయా రంగాలకు సంబంధించిన ప్రాయోగిక పరిజ్ఞానాన్ని, క్షేత్రస్థాయి అనుభవాన్ని పొందుతున్నారు.అగ్రికల్చర్ విభాగం విద్యార్థులు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి, ఎరువుల వినియోగం, వ్యవసాయ ఉత్పత్తులు, రైతులకు అందించే సేవలు, వ్యవసాయ రంగంలో ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాల గురించి అవగాహన పెంపొందించుకుంటున్నారు.మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగం విద్యార్థులు స్థానిక ఫోటో స్టూడియోను సందర్శించి, ఫోటోగ్రఫీ, ఫోటోషూట్, కెమెరా వినియోగం, లైటింగ్ పద్ధతులు, ఫోటో ఎడిటింగ్, డిజిటల్ మీడియా సాంకేతికతలు, స్టూడియో నిర్వహణ తదితర అంశాలపై ప్రాయోగిక పరిజ్ఞానాన్ని పొందుతున్నారు. అలాగే ఈ రంగంలో ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాల గురించి తెలుసుకుంటున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస పురోగతిని తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, వృత్తి విద్య ద్వారా పుస్తక పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అనుభవాన్ని పొందడం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. వ్యవసాయం, మీడియా వంటి రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, ఇంటర్న్‌షిప్ ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉద్యోగ, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు, సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారిని భవిష్యత్తులో ఉపాధికి సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.ఈ కార్యక్రమాల్లో వృత్తి విద్య – అగ్రికల్చర్ అధ్యాపకుడు జాడి సాయి వినయ్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ అధ్యాపకురాలు ఆసం ఓమ్ని శ్రీ నయని, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ప్రొప్రైటర్ నీరటి ప్రశాంత్, ఫ్రెండ్స్ ఫోటో స్టూడియో ప్రొప్రైటర్ దర్శనం రంజిత్, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థినుల ఎంపిక

ఉద్యమపోరు, కరకగూడెం, అక్టోబర్ 10 :
పినపాక నియోజకవర్గం కరకగూడెం మండల తహసీల్దార్ కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు కార్డులను అందజేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ సదుపాయాలు అందించడంతో పాటు, ప్రజలకు అవసరమైన సంక్షేమ ప్రయోజనాలు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు ప్రజలకు ప్రభుత్వ రేషన్ సదుపాయాలను పొందడంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వివిధ కార్యక్రమాలను

అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారికి వాటి ప్రయోజనాలు సక్రమంగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.పినపాక నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వట్టం కాంతయ్య , ఎంపీడీవో శ్రీనివాస్ రావు , హౌసింగ్ ఏఈ వినీత , జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోడిశాల రామనాథం, జిల్లా సెక్రటరీ ఎర్ర సురేష్, జిల్లా ఎక్స్యూటివ్ మెంబెర్ నాగబండి వెంకటేశ్వర్లు,మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ , జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోళ్లపడకల్‌లో లో వోల్టేజీ సమస్య.. రైతులకు తప్పని ఇబ్బందులు

- అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి: పీఏసీఎస్ డైరెక్టర్ నాగుల సత్యనారాయణ

ఉద్యమపోరు, మహేశ్వరం, అక్టోబర్ 10 : మహేశ్వరం మండల పరిధిలోని కోళ్లపడకల్ గ్రామంలో నెలకొన్న లో వోల్టేజీ సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీఏసీఎస్ డైరెక్టర్ నాగుల సత్యనారాయణ తెలిపారు.తక్కువ వోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదని,ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడటంతో ఫ్యూజులు కాలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.ఈ సమస్య పరిష్కారం కోసం రైతులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని ఇప్పటికే దరఖాస్తు చేసుకోవడంతో పాటు డీడీ కూడా చెల్లించారని తెలిపారు.అయినప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఆలస్యం కావడంతో సాగు పనులకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మహేశ్వరం విద్యుత్ శాఖ ఏఈ,డీఈ అధికారులు వెంటనే స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు.రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యుత్ సమస్యలపై రైతులు ఫోన్ చేసినప్పుడు సిబ్బంది తక్షణమే స్పందించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే,విద్యుత్ సమస్యల కారణంగా రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్వయంగా జంపర్లు వేయడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు.అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని నాగుల సత్యనారాయణ తెలిపారు.మండల నాయకులు కూడా చొరవ తీసుకుని రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.రైతులు బాగుంటేనే అందరం బాగుంటాం. రైతుల ఇబ్బందులను అధికారులు గుర్తించి, విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి అని నాగుల సత్యనారాయణ పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి రెడ్డి సుధీర్ రెడ్డి

ఉద్యమపోరు, ఎల్బీనగర్, అక్టోబర్ 10 : ప్రజాస్వామ్య వ్యవస్థ పై ప్రజలకు నమ్మకం కల్పించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు.ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపణలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ మేరకు భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీకి, ప్రస్తుతం బిజెపి పాలనలో నెలకొన్నాయని తాము ఆరోపిస్తున్న అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితుల మధ్య పోలికలు ఉన్నాయని సుధీర్ రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, జవాబు దారితనం పాటించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అణిచివేస్తూ ప్రశ్నించే గొంతులను నిరోధిస్తూ, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను నిర్బంధించే చర్యలను బిఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.తెలంగాణ నుంచి తమ హక్కుల కోసం వెళ్లిన విద్యార్థులను భూపాల్ లో నిర్బంధించడం వంటి ఘటనలు శాంతియుత నిరసన తెలిపే హక్కు పై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని పేర్కొంటూ అరెస్టు చేసిన విద్యార్థులు తమ తమ రాష్ట్రాలకు క్షేమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిపక్షాలను ప్రశ్నించే వారిని ఫేక్ మీడియా ద్వారా దేశద్రోహులు, పాకిస్తాన్ లేదా చైనా గూఢచారులు, జార్జ్ సోరోస్ కు చెందిన వ్యక్తులంటూ ముద్ర వేసే ప్రయత్నాలు చేయవద్దని సుధీర్ రెడ్డి హితవు పలికారు. ఈ ధర్నాలో మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు ఉద్యమకారులు మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఓటు హక్కు పరిరక్షణకు తమ సాంఘీభావాన్ని ప్రకటించారు.

వెల్జాల్‌లో జోరుగా బీజేపీ యువ నాయకుడి పుట్టినరోజు సంబరాలు

ఉద్యమపోరు, తలకొండపల్లి, అక్టోబర్ 10 : తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో బిజెపి యువ నాయకుడు చింతకాయల శ్రీను జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. బిజెపి సీనియర్ నాయకుడు తిరుమణి రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను పార్టీ శ్రేణులు, వివిధ పార్టీల నాయకులు, శ్రీను స్నేహితులు, అభిమానులు పెద్ద ఎత్తున నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ కేంద్రంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలలో తిరుమణి రాఘవేందర్ గౌడ్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొని చింతకాయల శ్రీనుకు శాలువా కప్పి, పుష్పగుచ్చం అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకలో రాఘవేందర్ గౌడ్ మాట్లాడు తూ, పార్టీ బలోపేతానికి యువత పాత్ర ఎంతో కీలకమని, చింతకాయల శ్రీను లాంటి యువ నాయకులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుంటూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో శ్రీను చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ శ్రీశైలం గౌడ్, రిపోర్టర్ విజయ్ యాదవ్, చింతకాయల రాము, లక్ష్మణ్, పులిజాల రాము, వద్దే సాయి, రవి ముదిరాజ్, ఆంజనేయులు, సతీష్ చారి, మల్లేష్,కార్యకర్తలు, యువజన సంఘాల ప్రతినిధులు మరియు చింతకాయల శ్రీను అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కమలాపురంలో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

ఉద్యమపోరు, మంగపేట, అక్టోబర్ 10 : ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామంలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ తొలిరోజు సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. గ్రామంలో పండుగ సందడి నెలకొనగా, మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతను, ప్రకృతిపై ప్రేమను చాటిచెప్పే బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

మంథనిలో నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఉద్యమపోరు, పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 10 : మంథని పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అక్టోబర్ 11, ఆదివారం నుంచి 20వ తేదీ మంగళవారం వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని అందంగా అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ దేవతా స్వరూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.ఉత్సవాల తొలిరోజు ఉదయం 6 గంటలకు అఖండ దీపారాధన, పుణ్యాహవాచనం, 7.45 గంటలకు కలశ స్థాపన, ఉదయం 9 గంటలకు నాదబ్రహ్మ సప్తాహ దీక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 17న రాత్రి 9 గంటలకు చక్రిభజన, 18న గోపాల కాలువలు నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కోలాటాలతో పట్టణ పురవీధుల్లో ఊరేగించనున్నారు. రాత్రి భజనలు, లలితా పారాయణం, దుర్గా జననం, పవళింపు సేవ, ఆశీర్వచన కార్యక్రమాలు జరగనున్నాయి.నవరాత్రుల్లో తొలిరోజు శ్రీ దుర్గాదేవి, రెండో రోజు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి, మూడో రోజు శ్రీ గాయత్రీదేవి, నాలుగో రోజు శ్రీ అన్నపూర్ణాదేవి, ఐదో రోజు శ్రీ కాత్యాయనీదేవి, ఆరో రోజు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి, ఏడో రోజు శ్రీ మహాలక్ష్మిదేవి, ఎనిమిదో రోజు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సరస్వతీదేవి అలంకరణల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. దుర్గాష్టమి, విజయదశమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించనున్నారు.నవరాత్రి ఉత్సవాల్లో ముత్తైదువులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించడం శుభప్రదమని భక్తుల విశ్వాసం. తొమ్మిది రోజుల పాటు నిరంతర సామూహిక భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దసరా పండుగ చివరి రోజున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించడంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు చేపట్టనున్నారు.ఆధ్యాత్మిక చింతన, మనోనిగ్రహం, ఆత్మజ్ఞానం పెంపొందించుకోవడానికి నవరాత్రి ఉత్సవాలు దోహదపడతాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆరాధించడం ద్వారా మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక తృప్తి లభిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు మారుపాక ప్రశాంత్ కోరారు.

ఇల్లంద ఊర చెరువుకు మహర్దశ

ఉద్యమపోరు, వరంగల్ జిల్లా / వర్ధన్నపేట, అక్టోబర్ 10 : ఇల్లంద గ్రామ ఊర చెరువుకు మహర్దశ పట్టనుంది. గ్రామానికి కీలకమైన నీటి వనరుగా ఉన్న చెరువు కట్ట మరమ్మతుల కోసం రూ.40 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. దీంతో చెరువు కట్ట పటిష్టత పెరగడంతో పాటు నీటి నిల్వకు మరింత భరోసా లభిస్తుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు వ్యవసాయానికి, నీటి అవసరాలకు ఎంతో కీలకమని, వాటి పరిరక్షణతోనే జలవనరులను భవిష్యత్తు తరాలకు అందించగలమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఇల్లంద ఊర చెరువు కట్ట మరమ్మతులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది.చేపట్టనున్న మరమ్మతు పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

TGTEL/26/A7716

ఏటూరునాగారంలో ఘనంగా పూలసింగిడి సంబరాలు

ఉద్యమపోరు, ఏటూరునాగారం, అక్టోబర్ 10 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పూలసింగిడి (బతుకమ్మ) సంబరాలు ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని బొడ్రాయి ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. బొడ్రాయి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను గ్రామ సర్పంచ్ కాకుల మర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరిన ఆడపడుచులు ఆటపాటలతో సందడి చేశారు.తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రకరకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రకృతిని పూజిస్తూ, పూలకు ప్రాధాన్యమిస్తూ నిర్వహించే ఈ వేడుకలు తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి. బొడ్రాయి ప్రాంగణంలో బతుకమ్మ పాటలు మార్మోగడంతో పండుగ వాతావరణం నెలకొంది.బతుకమ్మ పండుగ కేవలం పూలను పేర్చి పూజలు చేయడానికే పరిమితం కాకుండా ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటుతుంది. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి, చుట్టూ చేరి పాటలు పాడుతూ ఆడిపాడటం ఈ పండుగ ప్రత్యేకత.తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో బతుకమ్మను పూజిస్తూ, చివరి

రోజు సద్దుల బతుకమ్మతో వేడుకలను ఘనంగా ముగిస్తారు. పూల సౌందర్యం, జానపద గీతాల మాధుర్యం, ఆడపడుచుల ఆటపాటలతో బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని ప్రతిబింబిస్తుంది. ఏటూరునాగారంలో ప్రారంభమైన ఈ సంబరాలు రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా కొనసాగనున్నాయి.

భద్రకాళి అమ్మవారికి 27 కిలోల పసుపుతో అభిషేకం

- **ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ**

ఉద్యమపోరు, వరంగల్ / భద్రకాళి ఆలయం , అక్టోబర్ 10 : వరంగల్ నగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు శనివారం అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని జగత్ప్రసూతికా అలంకారంలో దర్శనమిచ్చేలా అలంకరించి, భక్తులు సమర్పించిన 27 కిలోల స్వచ్ఛమైన పసుపు చూర్ణంతో హరిద్రాభిషేకం నిర్వహించారు. పసుపుమయమైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి నిత్యాహ్నిక పూజలు నిర్వహించిన అనంతరం వైదిక క్రతువులతో హరిద్రాభిషేకం జరిపారు. అనంతరం జగత్ప్రసూతికా అలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులకు దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపుతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకోవడం అపూర్వమైన అనుభూతినిచ్చిందని భక్తులు తెలిపారు. అనంతరం వాస్తు యాగం, పర్యగ్నికరణం నిర్వహించి శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు.

జగత్ప్రసూతికా అలంకార విశిష్టత

జగత్ప్రసూతికా అలంకారం వెనుక ఉన్న ఆధ్యాత్మిక విశిష్టతను ఆలయ పూజారి భద్రకాళి శేషు భక్తులకు వివరించారు. సమస్త జగత్తుకు ఆదిమూలమైన మహాలక్ష్మి నుంచే మహాకాళి, మహాసరస్వతి ఆవిర్భవించారని, త్రిశక్తుల ద్వారా సృష్టి, స్థితి, లయలు కొనసాగుతున్నాయని తెలిపారు. జగత్తును ప్రసవించిన తల్లిగా అమ్మవారిని భావించి జగత్ప్రసూతికా అలంకారంలో పూజిస్తారని వివరించారు.ప్రసవానంతరం తల్లికి పసుపు లేపనం చేసి స్నానం చేయించే సంప్రదాయానికి ప్రతీకగా అమ్మవారికి హరిద్రా లేపనం చేసి, అనంతరం అభిషేకం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అలంకారం ద్వారా జగన్మాత సృష్టిశక్తిని ఆరాధిస్తారని తెలిపారు.అలాగే అమావాస్య తిథికి పితృదేవతలు అధిదేవతలుగా భావించబడతారని, ఈ రోజున జగన్మాతను ఆరాధించడం వల్ల పితృదేవతల అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసమని వివరించారు.

ఈ నేపథ్యంలోనే భాద్రపద అమావాస్య రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు విశేషంగా తరలివస్తారని తెలిపారు.

అదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఆదివారం ఉదయం 4 గంటలకు అమ్మవారికి పూర్ణాభిషేకం నిర్వహించడంతో పరాభవ నామ సంవత్సర దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య భరోసా

ఉద్యమపోరు, కరీంనగర్ జిల్లా / జమ్మికుంట, అక్టోబర్ 10 :
వైద్యం రోజురోజుకూ ఖరీదవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్నాయి. ఇలాంటి తరుణంలో రోగుల ఆరోగ్య సమస్యలను అర్థం చేసుకుంటూ, వారి ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వైద్య సేవలు అందించడం ప్రాధాన్యత సంతరించుకుంటోంది. ఈ నేపథ్యంలో జమ్మికుంట పట్టణంలోని సంజీవని బహుళ ప్రత్యేక వైద్యశాలలో స్త్రీ వైద్య నిపుణురాలిగా, సంతానలేమి సమస్యల చికిత్స నిపుణురాలిగా సేవలందిస్తున్న డాక్టర్ ఎం. ప్రణీత సేవలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి.

రోగుల పట్ల మానవీయ దృక్పథం

వైద్య వృత్తిని కేవలం వృత్తిగా కాకుండా సేవా బాధ్యతగా భావించడం ఎంతో ముఖ్యమని వైద్య రంగం గుర్తుచేస్తోంది. ముఖ్యంగా మహిళల ఆరోగ్యం, గర్భధారణకు సంబంధించిన సమస్యలు, సంతానలేమి వంటి సున్నితమైన అంశాల్లో వైద్య చికిత్సతో పాటు రోగులకు మానసిక ధైర్యం కల్పించడం కూడా అవసరం. రోగుల సమస్యలను ఓపికగా తెలుసుకొని, వారికి తగిన వైద్య మార్గదర్శకత్వం అందించడం ద్వారా వైద్యులపై నమ్మకం పెరుగుతుంది.

వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించడమే లక్ష్యం కావాలి

కుటుంబంలో ఒకరు అనారోగ్యానికి గురైతే వైద్య ఖర్చుల ప్రభావం కుటుంబ ఆర్థిక పరిస్థితిపై పడుతుంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు చికిత్స కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటుంటాయి. ఇలాంటి సందర్భాల్లో రోగుల ఆర్థిక ఇబ్బందులను అర్థం చేసుకొని, అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలు, వైద్య సదుపాయాల గురించి వివరించడం ఎంతో ఉపయోగకరం. ఆర్థిక స్థోమతకు అనుగుణంగా వైద్య సేవలు పొందే మార్గాలపై అవగాహన కల్పించడం కూడా వైద్య సేవల్లో కీలకమైన అంశం.

మహిళల ఆరోగ్యంపై అవగాహన అవసరం

మహిళలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. స్త్రీ సంబంధిత ఆరోగ్య సమస్యలు, గర్భధారణ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, సంతానలేమి సమస్యలకు సంబంధించి సరైన సమయంలో వైద్య సలహా తీసుకోవడం ముఖ్యం. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, వారి సమస్యలను గోప్యతతో అర్థం చేసుకొని తగిన చికిత్స అందించడం కుటుంబ ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుంది.

మానవత్వమే వైద్య సేవలకు అసలైన విలువ

ఆధునిక వైద్య సదుపాయాలతో

పాటు రోగుల పట్ల ఓర్పు, ఆప్యాయత, బాధ్యత కూడా వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తాయి. రోగి పరిస్థితిని అర్థం చేసుకోవడం, కుటుంబ సభ్యులకు తగిన సూచనలు ఇవ్వడం, చికిత్సకు సంబంధించిన వివరాలను స్పష్టంగా తెలియజేయడం ప్రజల్లో వైద్యుల పట్ల విశ్వాసాన్ని పెంపొందిస్తాయి. జమ్మికుంట పట్టణంలోని సివిల్ ఆసుపత్రి రోడ్డులో ఉన్న సంజీవని బహుళ ప్రత్యేక వైద్యశాలలో సేవలందిస్తున్న డాక్టర్ ఎం. ప్రణీత మరింత మంది మహిళలకు, పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. వైద్యం అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వ, ప్రైవేటు వైద్య రంగాలు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జనప్రియ క్వార్టర్స్‌లో నూతన సీసీ రోడ్డు ప్రారంభం

ఉద్యమపోరు, కొత్తపేట, అక్టోబర్ 10 : కొత్తపేట డివిజన్ పరిధిలోని జనప్రియ క్వార్టర్స్ బ్లాక్ నంబర్ 10 నుండి జనప్రియ కమాన్ వరకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఈరోజు కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ ప్రారంభించారు.గతంలో ఈ రహదారి గుంతలమయంగా ఉండటంతో కాలనీ నివాసులు, అపార్ట్మెంట్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. నూతన సీసీ రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ గారిని అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జనప్రియ క్వార్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ స్వరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ అశ్విన్ సింగ్ ఠాకూర్, శ్రీ శంభు, అసోసియేషన్ సభ్యులు, స్థానిక నివాసులు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయానికి బీరువా విరాళం

ఉద్యమపోరు, శామీర్ పేట, అక్టోబర్ 10 : శ్రీ కనకదుర్గ అమ్మవారి సేవా నిమిత్తం అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్ బీరువాను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఆయన కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అబ్బాగౌని భాస్కర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ సామల జశ్వంత్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ సర్పంచ్ ఏళ్ల మల్లేష్, కుడుముల వెంకటేష్, అబ్బాగౌని వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని సన్మానించిన కొప్పుల ప్రభావతి రెడ్డి.

ఉద్యమపోరు, ఏన్కూర్, అక్టోబర్ 10 : ఖమ్మం పట్టణంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో శనివారం ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన సభలో ఏన్కూరు మండలానికి చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రభావతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రభావతి రెడ్డి మాట్లాడుతూ దివంగత నేతలు రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డిలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రులుగా పనిచేసి ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ సేవలందించిన ఆ నాయకుల కుటుంబానికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వారి సేవా భావం, ప్రజలతో ఉన్న అనుబంధం చిరస్మరణీయమని పేర్కొన్నారు.పట్టభద్రుల సమస్యల పరిష్కారం, నిరుద్యోగుల సంక్షేమం, విద్యావంతుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి పట్టభద్రుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు.అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ప్రభావతి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన వారంతా ఓటరు నమోదుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com